క్షత్రియ వికాస్ సేవలు భేష్



క్షత్రియ సమాజ్ సభ్యులను సన్మానిస్తూ..

జీడిమెట్ల: పేద ప్రజలకు సొంత ఖర్చులతో క్యాటరాక్ట్ ఆపరేషన్స్ చేయించినందుకు క్షత్రియ వికాస్, క్షత్రియ యూత్ ఫెడరేషన్ వారిని స్థానికులు సన్మానించారు. క్షత్రియ వికాస్ వారు ఆగస్టు 15 నుంచి ఇప్పటి వరకు 40మందికి రూ.7లక్షలు వెచ్చించి కంటి ఆపరేషన్స్ చేయించి ఉచితంగా కళ్ల అద్దాలు పంపిణీ చేశారు. కంటి ఆపరేషన్స్ చేయించుకున్న వారు క్షత్రియ వికాస్ వారైన శివాజీరాజు, సంతోష్, ఉషాకల్యాణి, సత్తిబాబు, తారాసింగ్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా క్షత్రియ వికాస్ సభ్యులు మాట్లాడుతూ మరింత ఉత్సాహంతో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు.

ఓ మహనీయుడా.. క్షమించు..



జగద్గిరిగుట్ట: జీహెచ్‌ఎంసీ సిబ్బంది చెత్తను సేకరించే డబ్బాలతో చెత్తను పాయింట్‌ల వద్ద సమకూరుస్తారు. పని పూర్తయిన తర్వాత డబ్బాలను ఎక్కడ పెట్టాలో తెలియక నిత్యం రద్దీగా ఉండే జగద్గిరిగుట్ట బస్టాప్‌లో స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ విగ్రహం పక్కన పేరుస్తున్నారు. దీంతో పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

దేశ నిర్మాణం కోసం కలిసికట్టుగా..



నిజాంపేట్: బాచుపల్లి బీజేపీ బృందం, కౌశల్య కాలనీలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో విజయదశమి ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ బాచుపల్లి అధ్యక్షుడు ప్రసాద్‌రాజు, ప్రధాన కార్యదర్శులు సంతోష్, నారాయణమూర్తి, ప్రహ్లాద్, ఉపాధ్యక్షులు విజయ్, సురేష్, భూపాల్, శివ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ విజయదశమి ఉత్సవంలో పాల్గొనం ద్వారా స్వార్థరహిత సేవా భావం, దేశ నిర్మాణం కోసం కలిసికట్టుగా కృషిచేసే సంకల్పం మరింత బలపడుతుందన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ సోదరులతో కలిసి పాల్గొనడం ఎంతో గర్వకారణంగా ఉందని అన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు శేఖర్ యాదవ్, మల్లేష్‌యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు హస్మత్‌పేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించే శిబిరానికి హాజరై పరీక్షలు చేయించుకోవాలని కోరారు. వివరాలకు ఫోన్: 90000 66337, 97016 12299

కార్మికులకు హెల్త్ కార్డుల పంపిణీ



ఆల్విన్‌కాలనీ: శ్రీభవానీ శ్రమశక్తి భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు బాలప్ప ఆహ్వానం మేరకు పాపిరెడ్డినగర్ కంటెస్టెడ్ అధ్యక్షుడు చిట్టిరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆదివారం కార్మికులకు హెల్త్ కార్డులను అందజేశారు. కార్మిక జెండా ఎగురవేసి భవనాలను నిర్మించే సమయంలో కార్మికులు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వ్యవస్థాపక అధ్యక్షుడు నాగప్ప, ప్రధాన కార్యదర్శి, శ్రీను, డాకురి అక్కిరెడ్డి, మల్లేష్, గడ్డం సునీల్, నరసింహ, బుల్లెట్ రాజు, ఆగంరెడ్డి, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు. .

బాధిత కుటుంబానికి పరిహారం అందజేస్తాం

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని సఫ్దార్‌నగర్‌లో నాలా పక్కన ఉన్న ఒక ఇంటి గోడ ప్రమాదవశాత్తు కూలిపోవడంతో ఇంట్లోని వస్తువులు నాలాలో పడిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న కార్పొరేటర్ సబిహా బేగం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబానికి పరిహారం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు.



వైష్ణవి ఎన్‌క్లేవ్‌లోని శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద..



గాజులరామారం చిత్తారమ్మ దేవి ఆలయం ప్రాంగణంలో..

ఘనంగా బతుకమ్మ సంబురాలు



చింతల్ అక్షర స్కూల్‌లో బతకమ్మ ఆడుతూ..

ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. బస్తీలు, కాలనీలలో మహిళలు, యువతులు సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మలు పేర్చి పాటలు పాడుతూ బతుకమ్మ ఆడుతూ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు.

– కుత్బుల్లాపూర్ జోన్ బృందం



గాజులరామారం రావినారాయణరెడ్డి స్కూల్‌లో..



బతుకమ్మ వేడుకల్లో మహిళలు



ఏపీహెచ్‌బీ కాలనీ శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో..



గాజులరామారం శ్రీనిధి గ్లోబల్ స్కూల్‌లో..



నిజాంపేట జర్నలిస్ట్ కాలనీలో శ్రీలక్ష్మి గణపతి ఆలయం వద్ద..

'ప్రగతినగర్‌లో కుంటుపడిన అభివృద్ధి'



సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు

నిజాంపేట్: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ప్రగతినగర్‌లో అభివృద్ధి కుంటుపడిందని కార్పొరేషన్‌కు చెందిన బీఆర్‌ఎస్ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తూ, కాంగ్రెస్ పార్టీ నాయకులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రగతినగర్ శ్మశానవాటిక వద్ద ఆదివారం వారు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రగతినగర్ వ్యవస్థాపకులు అని చెప్పుకునే నాయకులు తమ సొంత వ్యాపారాల అభివృద్ధి కోసం పార్క్ స్థలాలను, ప్రభుత్వ స్థలాలను, శ్మశాన వాటికకు కేటాయించిన స్థలాన్ని అమ్ముకుంటే, ప్రగతినగర్ వాసుల చివరి మజిలీ కష్టాలు తీర్చాలని నేటికీ స్థానిక బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు పోరాడుతున్నారని అన్నారు. కొందరు వ్యక్తులు శ్మశాన వాటికను అభివృద్ధి చేయకుండా అడ్డంకులు సృష్టించినా, ప్రజలకు ఉపయోగపడాలనే ఒకే ఒక్క ఆలోచనతో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు అభివృద్ధికి ముందడుగు వేసి, 2023 ఆగస్టులో సుమారు రూ.50లక్షల నిధులతో సీసీరోడ్డు నిర్మాణం, దహనవాటిక ఏర్పాటు, నాలుగు రూములను నిర్మించడం జరిగిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో వెచ్చించిన నిధులు తప్పా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి శ్మశానవాటిక అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బాలాజీ నాయక్, డివిజన్ అధ్యక్షుడు స్టాలిన్‌రెడ్డి, ఉప్పు జశ్వంత్, శ్రీకర్‌గుప్తా, యాదగిరిగౌడ్, నాయకులు సాంబశివరెడ్డి, నీరుడు యాదగిరి, దండుగుల స్వామి, అజయ్ చౌదరి, ఎండీగౌస్ పాషా, లలితారెడ్డి, కృష్ణ మంజరి, ఉప్పు శిల్పా, అంజలి, కురుమూర్తి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్లకు ప్యాచ్ వర్కులు

సాక్షి ఎఫెక్ట్..



జగద్గిరిగుట్ట బస్టాప్‌లో రోడ్లపై కొనసాగుతున్న ప్యాచ్‌వర్క్‌లు

జగద్గిరిగుట్ట: ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న రోడ్లపై ఈ నెల 16వ తేదీన సాక్షిలో 'బాబోయ్.. ఇవేం రోడ్లు' అని ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. ఆదివారం జగద్గిరిగుట్ట బస్టాప్, ఇందిరాగాంధీ విగ్రహ సమీపంలో బీటీ రోడ్డుకు ప్యాచ్‌వర్క్ చేశారు. అలాగే ఇదే రోడ్డులో కుంగిన మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు నిర్వహించారు. గాజులరామారం ఏఈ తిరుపతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవీందర్, స్థానిక కార్పొరేటర్ జగన్ పర్యవేక్షణలో ఈ పనులు నిర్వహించారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

థర్మో కేబుల్ పరిశ్రమ యాజమాన్యానికి నోటీసులు



థర్మో కేబుల్ పరిశ్రమ హెచ్‌ఆర్‌తో సమావేశమైన జాయింట్ కమిషన్ ఆఫ్ లేబర్ శ్యాంసుందర్‌రెడ్డి

కుత్బుల్లాపూర్: కార్మికుల రిటైర్‌మెంట్ వయసు తగ్గిస్తూ పరిశ్రమ యాజమాన్యానికి లేబర్ జాయింట్ కమిషనర్ నోటీసులు జారీ చేవారు. జీడిమెట్ల పారిశ్రామికవాడలో థర్మో కేబుల్ కంపెనీ యాజమాన్యం కార్మికుల రిటైర్‌మెంట్‌ను 55 సంవత్సరాలకే కుదించింది. ఈ విషయమై ఎన్నో సంవత్సరాలుగా కార్మికులు పోరాడుతున్నా పరిశ్రమ యాజమాన్యం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. దీంతో కార్మిక నేత చింతల నాగరాజు ఈ విషయాన్ని జాయింట్ కమిషన్ ఆఫ్ లేబర్ శ్యాంసుందర్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆదివారం పరిశ్రమ హెచ్‌ఆర్ శ్రీకాంత్‌తో సమావేశమైన చింతల నాగరాజు, శ్యాంసుందర్‌రెడ్డి యాజమాన్యంపై సీరియస్ అయ్యారు. 58 సంవత్సరాలు రిటైర్మెంట్ వయసును తప్పనిసరిగా అమలు చేయాలని, 55 సంవత్సరాలకు కుదించిన థర్మో కేబుల్ సంస్థ యాజమాన్యం ఇందుకు జవాబు ఇవ్వాల్సిందిగా లేబర్ జాయింట్ కమిషనర్ నోటీసులు జారీ చేశారు. దీంతో నాగరాజు హర్షం వ్యక్తం చేశారు. సమావేశంలో పరిశ్రమ యూనియర్ జనరల్ సెక్రటరీ శ్రీకాంత్‌రెడ్డి, బాడీ మెంబర్లు పాల్గొన్నారు.

ఉత్సాహంగా విజయదశమి వేడుకలు



విజయదశమి వేడుకలో వడ్డేపల్లి రాజేశ్వరరావు, స్వయం సేవకులు

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ కాలనీలోని రిక్రియేషన్ క్లబ్‌లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో విజయదశమి ఉత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా శ్రీమాన్ కోసాల రామకృష్ణమాచార్యులు హాజరై ప్రసంగించారు. ప్రథమ వక్తగా మంగళంపల్లి శ్రీధర్ పాల్గొని విజయదశమి మహాత్యాన్ని వివరించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొని ధ్వజ ప్రణామం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్వయం సేవక్ సంఘ్ స్థాపకుడు డా.కేశవ్ బాలిరాం హెడ్గేవార్ 1925లో ప్రారంభించిన ఈ మహోన్నత సేవాయజ్ఞం ఈ రోజు 100 ఏళ్ల దిశగా అడుగులు వేస్తూ సమాజంలో జాతీయ అభిమానాన్ని పెంపొందిస్తూ, యువతను సన్మార్గంలో నడిపిస్తోందన్నారు. కార్యక్రమంలో వివేకానందనగర్ బస్తీ స్వయం సేవకులు, ప్రాంతీయ నాయకులు, సాంఘిక ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళి



గాజులరామారం ఆక్సిజన్ పార్కు వద్ద కొండా లక్ష్మణ్ బాపూజీకి బీఆర్‌ఎస్ నేతల నివాళి



గాంధీనగర్‌లో నివాళులర్పిస్తున్న జల్దా లక్ష్మీనాథ్, మీసాల సత్యనారాయణ తదితరులు



జగద్గిరిగుట్ట లాస్ట్ బస్టాప్‌లో నివాళులర్పిస్తున్న గూడ ఐలయ్యగౌడ్ తదితరులు

కుత్బుల్లాపూర్: నిరంకుశ నిజాంకు వ్యతిరేకంగా పోరాడి, తెలంగాణ తొలిదశ ఉద్యమకారుడు కొండ లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రజలు కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. గాజులరామారం ఆక్సిజన్ పార్కు, గాంధీనగర్ కమిటీ హాల్ వద్ద బీఆర్‌ఎస్ నాయకుల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

జగద్గిరిగుట్ట లాస్ట్ బస్టాప్‌లో..

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట లాస్ట్ బస్టాప్‌లో ఆదివారం మాజీ మంత్రి కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా కాంగ్రెస్ నాయకులు గూడ ఐలయ్యగౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ బడుగు బలహీన వర్గాలకు చేసిన సేవలు మరువలేనివని, తెలంగాణ రాష్ట్ర సాధన తొలి, మలి ఉద్యమం కోసం ఆయన ఆస్తులను ధారాదత్తం చేసి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమించారన్నారు. కార్యక్రమంలో రాష్ట్రీయ బీసీపీ జాతీయ ఉపాధ్యక్షుడు పద్మశాలి సంఘం నేత ఎం.జనార్దన్, దత్తాత్రేయ రుద్రా అశోక్, ప్రభాకర్, ఎల్లయ్య, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఐలా.. ఎప్పటికప్పుడు చెత్త తరలించాలా..

గాంధీనగర్ ఐలా అసోసియేషన్ సభ్యులు




గాంధీనగర్‌ను ఆనుకుని ఉన్న చెత్త డంప్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న స్వామిగౌడ్ తదితరులు

రంగారెడ్డినగర్: ఐలా పరిధిలో చెత్తాచెదారాలు పేరుకుపోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని గాంధీనగర్ ఐలా ఇండస్ట్రియల్ అసోసియేషన్ అధ్యక్షుడు స్వామిగౌడ్ అన్నారు. గాంధీనగర్‌ను ఆనుకుని పారబోస్తున్న వ్యర్థాలను ఆదివారం ఆయన ఐలా అధికారి నజీర్ బాషాతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా స్వామిగౌడ్ మాట్లాడుతూ ఇండస్ట్రియల్ ఏరియాలో చెత్త డంప్ చేస్తుండటంతో చుట్టుపక్కల నివాసిత ప్రాంతవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఎప్పటికప్పుడు చెత్తను తరలించేలా చర్యలు తీసుకోవాలని ఐలా అధికారిని కోరారు. అదేవిధంగా పాడైన రోడ్లు, వర్షపు నీరు చేరుతున్న విషయాన్ని పరిష్కరించాలన్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రవీందర్ రావు, పలు బస్తీల సంక్షేమ సంఘాల సభ్యులు జల్దా లక్ష్మీనాథ్, కార్తీక్‌గౌడ్, సతీష్, జగదీష్, రాజారెడ్డి, సురేష్, తిమ్మయ్య ఉన్నారు.

హత్య కేసులో ఇద్దరు నిందితుల రిమాండ్

కుత్బుల్లాపూర్: హత్య కేసులో ఇద్దరు వ్యక్తులను రిమాండ్‌కు తరలించిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ విజయవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకులం జిల్లాకు చెందిన పడాల ఆనంద్, పడాల సుధాకర్ నగరంలో స్థిరపడి దూలపల్లిలో వెల్డింగ్, ఫ్యాబ్రికేషన్ బిజినెస్ నిర్వహిస్తున్నారు. దూలపల్లికి చెందిన శ్రీకాంత్‌గౌడ్‌కు చెందిన స్థలాన్ని తక్కువ ధరకు తనకు అమ్మాలని పడాల ఆనంద్ బెదిరింపులకు గురిచేస్తూ వచ్చాడు. ఈ నేపథ్యంలో ఈనెల 18వ తేదీన శ్రీకాంత్ తన స్నేహితులు అలీ, రాజుతో కలిసి స్థలం విషయంలో పడాల ఆనంద్‌తో దూలపల్లిలోని ఓ కంటైనర్ సమీపంలో గొడవ పడ్డారు. అదే రోజు సాయంత్రం దూలపల్లిలోని షెడ్డులో మరోసారి పడాల ఆనంద్, సుధాకర్‌తో మరోమారు గొడవకు దిగారు. ఈ క్రమంలో ఇరువురి మధ్య గొడవ పెద్దది కావడంతో ఆనంద్, సుధాకర్ ఇనుప రాడ్లతో శ్రీకాంత్‌గౌడ్, అలీపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. సూరారం మల్లారెడ్డి ఆస్పత్రిలో శ్రీకాంత్‌గౌడ్ మృతి చెందాడు. గాయపడిన అలీ పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉంది. ఈ మేరకు కేసు నమోదు చేసిన పేట్‌బషీరాబాద్ పోలీసులు పడాల ఆనంద్, సుధాకర్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

గాయపడిన కార్మికురాలికి పరిహారం



అనసూయకు పరిహారాన్ని అందజేస్తున్న సీఐటీయూ కన్వీనర్ లింగస్వామి తదితరులు

దుండిగల్: అసంఘటిత రంగ కార్మికులకు సీఐటీయూ అండగా ఉంటుందని దుండిగల్–గండిమైసమ్మ మండల కన్వీనర్ బొడిగె లింగస్వామి అన్నారు. ఓ అపార్ట్‌మెంట్‌లో హౌస్ కీపింగ్ కార్మికురాలిగా పనిచేస్తున్న అనసూయ అనే మహిళ విధుల్లో భాగంగా కాలుజారి పడిపోవడంతో తీవ్ర గాయాలపాలైంది. విషయం తెలుసుకున్న లింగస్వామి సదరు కాంట్రాక్టర్‌తో చర్చలు జరిపి బాధితురాలికి వైద్య ఖర్చులు, పోషణ నిమిత్తం రూ.లక్ష పరిహారం ఇచ్చేలా ఒప్పించారు. సదరు పరిహారాన్ని ఆదివారం బాధిత మహిళ అనసూయకు అందజేశారు. ఈ సందర్భంగా లింగస్వామి మాట్లాడుతూ పని ప్రదేశాలలో ప్రమాదాల బారిన పడిన కార్మికులకు సీఐటీయూ ఆధ్వర్యంలో అండగా ఉండి వారికి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. అసంఘటిత రంగ కార్మికులకు ఈఎస్‌ఐ, పీఎఫ్ సదుపాయాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

అమావాస్య అన్నదాన కార్యక్రమాలు



సీసాలబస్తీలోని దేవి వైష్ణవి నవదుర్గ మాత



మగ్దూంనగర్‌లోని మల్లికార్జున స్వామి ఆలయంలో కొనసాగుతున్న అన్నదానం

జగద్గిరిగుట్ట: అమావాస్యను పురస్కరించుకొని డివిజన్ పరిధిలోని పలు ఆలయాల్లో అన్నదాన కార్యక్రమాలు, వివిధ కాలనీల్లోని బొడ్రాయిల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- సీసాల బస్తీలోని దేవి వైష్ణవి నవదుర్గ మాత, జగద్గిరిగుట్ట కొండపై ఉన్న కాళికామాత ఆలయాల్లో అభిషేకం అర్చన, అలంకరణ తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- జగద్గిరిగుట్ట లాస్ట్ బస్టాప్‌లో దుర్గామాత ఆలయంలో ఆర్యవైశ్య సంఘం, మగ్దూంనగర్‌లోని మల్లికార్జున స్వామి, అంజయ్య నగర్‌లోని పోచమ్మ ఆలయాల్లో కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాలను పెద్దఎత్తున నిర్వహించారు.
- భూదేవిహిల్స్‌లోని బొడ్రాయి వద్ద స్థానిక భక్తులు, మగ్దూంనగర్ ప్రధాన రహదారిలో ఉన్న బొడ్రాయి వద్ద స్థానిక కార్పొరేటర్ జగన్ పూజలు నిర్వహించారు.



మగ్దూంనగర్ రహదారిలోని బొడ్రాయి వద్ద స్థానిక కార్పొరేటర్ జగన్ పూజలు



భూదేవిహిల్స్‌లోని బొడ్రాయి వద్ద స్థానికుల పూజలు